క్లుప్తంగా

జాజిరెడ్డిగూడెం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా యాదగిరి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మండలంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిప్పలపెల్లి యాదగిరి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జక్కర్తి శ్రీనివాసులు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ యాదగిరి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరిగేలా చూస్తానని అన్నారు.

ఐక్యత దిశగా తీర్మానం

సూర్యాపేట అర్బన్ : ఎంసీపీఐ(యూ) పార్టీలో భిన్నాభిప్రాయాలపై దిద్దుబాటు, ఐక్యత దిశగా రాజస్థాన్‌లో నిర్వహించిన సమావేశంలో తీర్మానం జరిగినట్లు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న శనివారం తెలిపారు. ఈ నెల 2న రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో మద్దికాయల అశోక్ ఓంకార్, కుల్దీప్‌సింగ్‌ల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీలో నెలకొన్న వివిధ భిన్నాభిప్రాయాలపై లోతుగా చర్చించినట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

ఆత్మకూర్(ఎస్) : విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని రామోజీతండా గ్రామశివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గుగులోతు లచ్చు, భూక్యా రమేష్ చెందిన ఆవులను మేతకు వదలగా అవి మేసుకుంటూ గ్రామశివారులో ఉన్న గుగులోతు భోజ్యా పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు లచ్చు, రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

చివ్వెంల వాసికి డాక్టరేట్



మౌనికకు డాక్టరేట్ అందజేస్తున్న ప్రొఫెసర్లు

చివ్వెంల : మండల కేంద్రానికి చెందిన కొణతం మౌనిక ఫార్మసీ విభాగంలో చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. డ్రగ్ పార్ములాలో భాగంగా డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ సాలీడ్ లిపిడ్ నానో పార్టికల్స్, ఎ మోడ్రన్ ఫార్మవెషన్ ఇన్ డ్రగ్ డెలివరి సీస్టమ్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ రవిందర్, కిష్టర్, శంకరయ్య, జగదీష్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సుధాకర్‌రెడ్డికే మండల అధ్యక్ష పదవి ఇవ్వాలి

నూతనకల్ : కాంగ్రెస్ మండల అధ్యక్ష బాధ్యతలు తిరిగి నాగం సుధాకర్‌రెడ్డికే అప్పగించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బంటు బద్రి కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తలకు అండగా నిలిచారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు మేడిపల్లి అశోక్, ఎండీ జహంగీర్, నెల్లుట్ల మహేష్, కొరివి గంగయ్య, బంటు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుతో అనేక అనర్థాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి లింగమూర్తి

తుంగతుర్తి : రక్తపోటుతో అనేక అనర్థాలు ఉంటాయని వైద్యాధికారి లింగమూర్తి అన్నారు. శనివారం ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా హైపర్ టెన్షన్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య విద్యా సమావేశాలు – పౌష్టికాహారం, వ్యాయామం, మందుల వినియోగం, బీపీ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంల సహకారంతో గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, ఫార్మసిస్ట్ శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ గాజుల సోమన్న, ఎల్‌డి కంప్యూటర్ నవీన్‌కుమార్, యూడీసీ శాంసన్, భాస్కర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాలు లేక ఇక్కట్లు!

- నూతన పంచాయతీల్లో ఏర్పాటు చేయని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

నాగారం : నూతన గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని గ్రామాల ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు మారుమూల గ్రామాలకు, తండాలకు రవాణా సదుపాయాలు లేక కాలినడకన, కిరాయి వాహనాలల్లో వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు పేద ప్రజలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాలతో పాటు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. 500మంది జనాభా దాటిన గ్రామాలను ప్రభుత్వం నూతన జీపీలుగా మార్చి, చౌకధరల దుకాణాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా నేటికి ఆచరణకు నోచుకోలేదు. దీంతో కార్డు దారులు పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు నెలనెలా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పేరబోయినగూడెంతో పాటు ఆవాస గ్రామామైన కంచుగట్లగూడెం, నర్సింహులగూడెంతో పాటు సర్వానాయక్‌తండా, దుబ్బతండా, మాణిక్యతండాలకు చెందిన ప్రజలు ప్రతినెలా నాగారంబంగ్లాకు వచ్చి రేషన్ బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. అలాగే శాంతినగర్, బీమ్లా తండాకు చెందిన వారు ప్రతినెలా 4కిమీ దూరంలో ఉన్న లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు. దీంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో సరైన రవాణా సౌకర్యం లేక కార్డుదారులు ప్రత్యేకంగా ఆటోలలో ప్రయాణించి రేషన్‌బియ్యం తీసుకువస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆటోలు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన జీపీలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నాగారంబంగ్లాలో రేషన్ తీసుకుంటున్న పేరబోయినగూడెం కార్డుదారుడు (ఫైల్)

రవాణాతో తీవ్ర ఇక్కట్లు..

రేషన్ దుకాణాలు లేని గ్రామాల ప్రజలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలు ప్రతినెలా పక్క గ్రామానికి రేషన్ దుకాణం కోసం ప్రత్యేకంగా ఆటోలలో వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండంతో రేషన్‌బియ్యం తీసుకునే లబ్దిదారుల సంఖ్య పెరిగింది. కానీ కార్డుదారులు ప్రతినెలా 5, 6కి.మీ. ఆటోలో వెళ్లి బియ్యం తీసుకోవాలంటే ఆటో చార్జీ రాను, పోను రూ.50 వరకు ఖర్చువుతుంది. ఒక వేళ తీరా రేషన్ దుకాణానికి వెళ్లాకా అక్కడ సిగ్నల్స్ లేకపోవడంతో, వేలిముద్రలు పడకపోవడం తదితర సమస్యలతో బియ్యం రాకుంటే డీలర్ల సూచన మేరకు మళ్లీ మరుసటి రోజు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ప్రజలు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుంది.

కొత్త రేషన్‌దుకాణం ఏర్పాటు చేయాలి



ఏళ్ల తరబడి రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాము. మా గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడినా ప్రతినెలా నాగారంబంగ్లా రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాము. ఆటోలో వెళ్లి 20కేజీల బియ్యం తెచ్చుకోవాలంటే ఆటోకి రానుపోను రూ.40 చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం నూతన జీపీలలో కొత్త రేషన్‌దుకాణాలు ఏర్పాటు చేయాలి.

– తీగుళ్ల ప్రశాంత్, పేరబోయినగూడెం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లు వారి తల్లిదండ్రులకు సూర్యాపేట రూరల్ స్టేషన్‌లో శనివారం కౌన్సిలింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సూర్యాపేట సర్కిల్‌లో పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సర్కిల్ పరిధిలోని పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూరు (ఎస్), రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 74మంది మైనర్ పిల్లలను వారి తల్లిదండ్రులను పిలిపించి వాహన చట్టాలు, రోడ్డు భద్రత, ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలు, జరిమానా, శిక్షలు, వాహన యజమానులపై, తల్లిదండ్రులపై చర్యలపై రూరల్ సీఐ రాజశేఖర్ అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ రోడ్డు భద్రతా నియమాల పట్ల పటిష్టంగా పనిచేస్తుందని, ప్రతిరోజు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణ కోసం నూతన కార్యాచరణ చేపట్టామన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని వారికి వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎవరైనా వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యాపేట సబ్ డివిజన్ ఎస్‌ఐలు బాలునాయక్, మహేష్, శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాల వద్ద ఎస్‌ఐలు

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి పరామర్శించి, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఈరేటి అంజయ్య, బండగొర్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల పరిశీలన

మద్దిరాల : మండలంలోని కుక్కడం గ్రామంలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను డీఎల్‌పీఓ నారాయణరెడ్డి శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, కార్యాదర్శి తేజశ్రీ, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌ను అవమానిస్తే ఊరుకోం

అర్వపల్లి : ఎమ్మెల్యే మందుల సామేల్‌ను అవమానపరిచేలా కొంతమంది అగ్రవర్ణాలకు చెందిన వారు వ్యవహరిస్తున్నారని అలా చేస్తే చూస్తూ ఊరుకోమని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం అర్వపల్లిలో కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. శుక్రవారం అర్వపల్లిలో కొంతమంది ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఎలాంటి సమాచారం లేకుండా సమావేశ ఫ్లెక్సీపై ఎమ్మెల్యే సామేల్‌ను అవమానపరిచేలా ఫొటోను పెట్టి సూర్యాపేట నియోజకవర్గ నాయకుడి ఫొటోకు ప్రాధాన్యం ఇవ్వడం తగదన్నారు. దళిత ఎమ్మెల్యే సామేల్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అవమానపరుస్తున్నారని అన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఏడాదిన్నర పదవీ కాలంలో రూ.1300కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సామేల్ జోలికి వచ్చిన వారిని నియోజకవర్గంలో ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. ఎమ్మెల్యేను విమర్శించే ఆ నాయకులంతా బీఆర్‌ఎస్ వారితో కలుస్తూ వారికి మేలు జరిగేలా మాట్లాడుతున్నారని అన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కడియం పరమేష్, తుంగతుర్తి మార్కెట్ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, దాసరి సోమయ్య, కోఆర్డినేటర్ జేడీ వీరస్వామి, కందుకూరి లక్ష్మయ్య, దాసరి శ్రీను, ఏఎంసీ డైరెక్టర్లు బి.సైదులు, జలేందర్, పాల్వాయి నాగరాజు, మహరాజు, సురేష్, పందిరి సురేందర్, బద్దం యాదగిరి, దల్వాయి శ్రీధర్, నిద్ర సంపత్, సైదులు, కృష్ణమూర్తి, రవీందర్‌నాయక్, యాదగిరి, చిరంజీవి, గంగదెరి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.



అర్వపల్లి : ఫ్లెక్సీలను చూపుతూ మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మెల్యేను అవమానిస్తే సహించేది లేదు

నూతనకల్ : ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కావాలని కొంతమంది అగ్రకుల నాయకులు గొడవలు సృష్టించి అబాసుపాలు చేయడాన్ని సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు దరిపెల్లి వీరన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణ చూసి కొంతమంది నాయకులు దళితుడనే భావనతో గొడవలు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అలాంటి వారికి తగిన సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఇరుగు కిరణ్, యామగాని రమేష్, అనంతుల శ్రీధర్, నాయకపు మల్లేష్, కొంపెల్లి రాజు, వేల్పుల కిరణ్, వెంకటేష్, ప్రశాంత్, వీరన్న, మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసిమెలిసి పనిచేయాలి

తుంగతుర్తి : కాంగ్రెస్ కార్యకర్తలు కలిసిమెలిసి పనిచేయాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం జరిగిన జాజిరెడ్డిగూడెం కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మందుల సామేల్ ఫ్లెక్సీలను పలువురు నాయకులు చించివేయడం సరికాదన్నారు. 60, 70సంవత్సరాలుగా దళితుల ఓట్లు అగ్రవర్ణాల వారు వేసుకొని పని చేయలేదా అని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగరాజు, అజయ్, అనిల్, మల్లేష్, నాగరాజు, మైసయ్య, పరుశరాములు పాల్గొన్నారు.

కేంద్రాలలో ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్మకాలు

అర్వపల్లి : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తిగా నెమ్మదించాయి. లారీలు రాక పోవడంతో విసిగిపోయిన రైతులు ఆయా కేంద్రాల్లోనే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఈ సీజన్‌లో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్క కేంద్రంలోని కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు నెలల తరబడి పడిగాపులు కాస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలతో ధాన్యం తడిసి పాడవుతుంది. చివరకు రైతులు చేసేదిలేక ప్రైవేటు వ్యాపారులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పిలిపించుకొని వాటిలోనే తమ ధాన్యాన్ని వారికి అమ్ముకుంటున్నారు. అర్వపల్లితో పాటు మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేసుకుపోతున్నారు. ప్రభుత్వం క్వింటా ధాన్యం రూ.2300 ధర నిర్ణయించగా ప్రైవేటు వ్యాపారస్తులు రూ.2000 నుంచి రూ.2100 వరకు క్వింటా చొప్పున కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. అదే విధంగా ప్రైవేటు వ్యాపారస్తులు రైతులకు ధాన్యం బిల్లులను అక్కడికక్కడే కేంద్రాల్లోనే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మడానికి మొగ్గు చూపుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ఆరబోయిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు

దేగల మధుసూదన్ సేవలు మరువలేనివి

ఆత్మకూర్(ఎస్) : ఎన్ని నిర్బంధాలు వచ్చినా తను నమ్మిన సిద్ధాంతం కోసం, విప్లవ పార్టీ అభివృద్ధికి దేగల మధుసూదన్ చేసిన సేవలు మరువలేనివని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు వి.కోటేశ్వరరావు అన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, ఆత్మకూరు మాజీ సర్పంచ్ దేగల మధుసూదన్ 35వ వర్ధంతి సభను శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి యువతకు దేగల మధుసూదన్ ఆదర్శమన్నారు. మధుసూదన్ కమ్యూనిస్టు నాయకుడిగా నిజాం వ్యతిరేక పోరాటంలో పాటు యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడాటమే కాకుండా కళాకారుడిగా, పోరాట యోధుడిగా, ప్రజలతోమమేకమై చెరగని ముద్ర వేశాడని అన్నారు. డాక్టర్ కె.రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పర్శ సామాజిక వేదిక చైర్మన్ కాకి భాస్కర్, దేగల జనార్దన్, అబ్బగాని భిక్షం, దేగల కృష్ణ, పోరండ్ల దశరథ, కంచనపల్లి సైదులు, గంట నాగయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మధుసూదన్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న వి.కోటేశ్వర్‌రావు

బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం



బొడ్రాయి ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు శనివారం గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి (నాభిశిల)ను డప్పుచప్పుల్లతో వైభవంగా గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా, మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేసి, మంగళహారతులతో టెంకాయలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమలో భాగంగా భక్తులు గణపతి పూజ, మంగళతోరణాలు, పుణ్యాహవచనం, రక్షధారణ, మండప పూజలు, జలాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కొండగడప హరిప్రసాద్‌శర్మ, కాశీ లక్ష్మణశర్మ, శేషగిరి వేణుశాస్త్రీ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిల్లర చంద్రమౌళి, గోడిశాల యాదగిరి, కన్నెబోయిన యాదగిరి, భిక్షపతి, యాదగిరి, వెంకన్న, శ్రీనివాస్, ప్రవీణ్, నాగార్జున, మహేష్, రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓపై చర్య తీసుకోవాలని వినతి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని నకిలీ డాక్టర్ల వ్యవహారంలో వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో, డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓపై విచారణ నిర్వహిస్తున్న రాష్ట్ర విచారణ కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా అర్హత లేని నకిలీ వ్యక్తులు వైద్యం చేస్తూ డాక్టర్లుగా చలామణి అవుతున్నట్టుగా వివిధ పత్రికల్లో ప్రచురితమైన, మెడికల్ కౌన్సిల్ వారు ఫిర్యాదు చేసిన అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తూ కంటి తుడుపు చర్యగా షోకాజ్ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్‌గా చలామణి అవుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

మలిదశ ఉద్యమకారులను గుర్తించాలి



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి కోరారు. తెలంగాణ ఉద్యమకారులు చేపట్టిన పాదయాత్ర శనివారం తిరుమలగిరికి చేరింది. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో అంబేద్కర్, జ్యోతిరావు పూలే, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ సాధన కోసం ఉద్యమాలు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసుల పాలయ్యామని, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని, ప్రతి ఉద్యమకారుడికి 200గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దుంపల కృష్ణారెడ్డి, రెహమాన్‌అలీ, సీపీఎం నాయకులు కడెం లింగయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కొత్తగట్టు యాకయ్య, రాములునాయక్, తోట ఉపేందర్, సాయి, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, సోమయ్య, సోమనారాయణ, వీరనారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



తిరుమలగిరి : రైతులతో మాట్లాడుతున్న అధికారులు



మద్దిరాల : కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

తిరుమలగిరి : మండలంలోని వెలిశాల, మర్రికుంట తండా, జలాల్పురం, మామిడాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హరిప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో కాంటాలైన ధాన్యాన్ని వెంటవెంటనే లారీలకు పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆలస్యం అవుతున్నాయని, లారీలు రాక ధాన్యం బస్తాలు వెంట వెంటనే ఎగుమతి కావడం లేదని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎం, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వర్షాలు దృష్ట్యా నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని, వానలు ఎక్కువగా కాకముందే ధాన్యం కాంటాలను పూర్తి చేయాలన్నారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య, సీసీ నాగార్జున్‌రెడ్డి, రైతులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

అర్వపల్లి : మండలంలోని వేల్పుచర్ల, అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిప్పలపెల్లి యాదగిరి సందర్శించారు. లారీల కొరత ఉండగా సంబంధిత అధికారులతో మాట్లాడి లారీలను తెప్పించి ధాన్యం బస్తాలు ఎగుమతి చేయించారు. అలాగే స్థానికంగా కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాస్తారోకో

అర్వపల్లి: తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, మిల్లుల్లో ధాన్యం కోతలను విధించొద్దని, ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేయాలని కోరుతూ శనివారం మండలంలోని వేల్పుచర్లలో 365బీ హైవేపై సీపీఎం ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో చేశారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోవడంతో అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ అక్కడికి చేరుకొని సంబంధిత అధికారుల దృష్టికి ధాన్యం కొనుగోళ్ల విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇప్పించి విరమింపజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, వజ్జె సైదయ్య, మర్రి సైదులు, సంపత్ కిరణ్, గైగుళ్ల అశోక్, ఖమ్మంపాటి వెంకటయ్య, శ్రీను, మహేష్, జానయ్య, పరమేష్, కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

గరిడేపల్లి: ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో జరిగిన సీపీఐ మండల మహాసభలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సభలో నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, పోకల వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, ధనుంజయ నాయుడు, మండవ వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, కుందూరు వెంకట్‌రెడ్డి, పంగ గోవింద్, వెంకటేశ్వర్లు, అంజన్‌రెడ్డి, ఎడ్ల అంజన్‌రెడ్డి, పున్నయ్య, రెమిడాల రాజు, బిళ్ల కనకయ్య పాల్గొన్నారు.

సరస్వతి పుత్రుడిని ఆదుకోరూ..!



బానోతు నవీన్

తుంగతుర్తి : ఓ సరస్వతి పుత్రుడి ఉన్నత చదువులకు ఆర్థిక సమస్య అడ్డువచ్చింది. మండలంలోని మానాపురం గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న, బీకి మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. వారికి ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. ఈ ముగ్గురు కూడా చదువులో చిన్నప్పటి నుంచి ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ ఉండేవారు. వారి చిన్నతనంలోనే తండ్రి మరణించగా తల్లి వారి బాధ్యతలను మోస్తూ వస్తుంది. తల్లి ఎన్నో ఇబ్బందులు పడుతూ పిల్లల్ని కష్టపడి చదివించింది. కుమారుడు బానోతు నవీన్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు మానాపురంలోని ప్రాథమిక పాఠశాలలో, ఆరు, ఏడు ,ఎనిమిది తరగతులు రావులపల్లి ఉన్నత పాఠశాలలో, 9, 10 గందూరి జానకమ్మ పాఠశాలలో చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఒకటి నుండి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి డీఆర్‌డీఏ ఇంటర్ బోడుప్పల్‌లోని ఎస్‌ఆర్ కాలేజీలో చదివి ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో బీటెక్ కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఈఈఈలో చదువు పూర్తి చేశాడు. మాస్టర్ డిగ్రీ చదువుకోవడానికి అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో సీటు లభించింది కానీ ఆ కళాశాలలో చేరాలంటే రూ.80లక్షల చెల్లించాల్సి ఉంటుంది. కాలిఫోర్నియా కళాశాల రూ.30లక్షల స్కాలర్‌షిప్ ఇస్తానని హామీ ఇచ్చింది, కాని మిగిలిన రూ.50లక్షలు చెల్లిస్తేనే ఆ కళాశాలలో సీటు లభిస్తుంది. కానీ అంత డబ్బు చెల్లించే స్థితిలో ఆ కుటుంబం లేదని, ఎవరైనా దాతలు సహకరించి తనను ఆర్థికంగా ఆదుకుంటే మాస్టర్ డిగ్రీని పూర్తి చేస్తానని లేకుంటే తాను ఇక్కడే ఉండి పోవాల్సి వస్తుందని విద్యార్థి నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు.